సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



విత్తన శుద్ధితో..
యాసంగి సీజన్ ప్రారంభమైంది. అన్నదాతలు దుక్కులు దున్నతూ వరి నారు పోసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. 10లో▸



ఉపాధ్యాయులదే బాధ్యత
విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. 10లో▸



అభివృద్ధికి నోచుకోని..
దౌల్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన లింకురోడ్లు అభివృద్ధికి నోచుకోవడంలేదు. 11లో▸

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పోటీలకు రితిష
- జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని
- సన్మానించిన ఉపాధ్యాయులు



రితిషను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న ఎం.రితిష రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పోటీలకు ఎంపికైంది. బుధవారం వికారాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 60 మంది విద్యార్థులు పాల్గొనగా రితిష విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. గురువారం బాలికను పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నర్సింలు మాట్లాడుతూ.. తమ పాఠశాలకు చెందిన రితిష రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీశైలం పాత్ర చాలా ఉందన్నారు. అనంతరం విద్యార్థిని రితిష మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సహకారంతోనే తాను విజయం సాధించానని తెలిపారు.

క్షయ వ్యాధిపై జాగ్రత్తలు తప్పనిసరి
డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్



మహిళకు ఎక్స్‌రే తీస్తున్న వైద్య సిబ్బంది

బొంరాస్‌పేట: క్షయ వ్యాధి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత ఎక్స్‌రే శిబిరం నిర్వహించారు. 72 మందికి పరీక్షలు చేయగా 12 మందికి టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వీరికి ఆరు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. పౌష్టికాహారం కోసం టీబీ అలర్ట్ ఇండియా ప్రతి నెలా రూ.1,000 వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, ఆకలి మందగించినా.. సాయంత్రం పూట జ్వరం, రోజురోజుకూ బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కొడంగల్, బొంరాస్‌పేట ప్రభుత్వాస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అక్షయ్, హెచ్‌ఈఓ రాజేశ్వరి, సీహెచ్‌ఓ శివరాజ్, రాజునాయక్, సాయి శంకర్‌రెడ్డి, రహత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ గణన పూర్తి చేయండి
అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వ్యవసాయ గణన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 11వ ప్రపంచ వ్యవసాయ గణనపై రెండవ దఫాగా క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సర్వే నంబర్ల ఆధారంగా పంట సాగు వివరాలు సేకరించాలన్నారు. నీటి పారుదల, రైతు సామాజిక, ఆర్థిక స్థితిగతులు, రుణాల సేకరణ, రైతులు వ్యవసాయ శాఖలో అనుసరిస్తున్న వివిధ పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వినియోగం తదితర వివరాలను మొబైల్ యాప్‌లో నమో దు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో సీపీఓ అశోక్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, మండల వ్యవ సాయ అధికారులు, విస్తరణ అధికారులు, ప్లానింగ్ స్టాటికల్ అధికారులు పాల్గొన్నారు.

నత్తనడకన పత్తి కొనుగోళ్లు



వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రం

జిల్లాలో 2.30లక్షల ఎకరాల్లో పంట సాగు
- 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- ఇప్పటి వరకు కొన్నది 61వేల మెట్రిక్ టన్నులే
- నేటి నుంచి మూతపడనున్న 8 సెంటర్లు

వికారాబాద్: జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు దాటినా ఎంచుకున్న లక్ష్యంలో సగం దిగుబడి కూడా సేకరించలేదు. తరచూ కేంద్రాలను మూసి ఉంచడంతో రైతులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. శుక్రవారం నుంచి 14 కొనుగోలు కేంద్రాల్లో ఎనిమిదింటిని మూసివేయనున్నట్లు మార్కెటింగ్ అధికారులు ప్రకటించారు. దీంతో పత్తి రైతులు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారని పత్తి రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడిప్పుడే కేంద్రాలకు పత్తి భారీగా వస్తోంది. ఇలాంటి సమయంలో కేంద్రాలను మూసి వేయాలని నిర్ణయించడం సరికాదని రైతులు అంటున్నారు.

40 శాతం లోపే..

దళారుల నుంచి పత్తి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాండూరు, వికారాబాద్, పరిగి ప్రాంతాల్లో మూడు చొప్పున, మర్పల్లి, కోట్‌పల్లి, ధారూరు, కొడంగల్‌లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. నెల రోజుల క్రితం వీటిని ప్రారంభించారు. వ్యవసాయ, మార్కెటింగ్, శాఖలు, సీసీఐ అధికారుల పర్యవేక్షణలో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 2.30 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేయగా ఒక్కో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల చొప్పున 2.2లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశారు. సీసీఐ కేంద్రాలు ద్వారా ఇప్పటి వరకు కేవలం 61వేల మెట్రిక్ పంటను మాత్రమే కొనుగోలు చేశారు. 40 శాతం పత్తిని కూడా కొనుగోలు చేయలేదు.

కొర్రీలతో అవస్థలు

కేంద్ర ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.7,521గా మద్దతు ధర నిర్ణయించింది. అయితే క్వింటాలుకు వంద రూపాయలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లులు, బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.6,500 చెల్లిస్తున్నారు. అయితే వెంటనే డబ్బులు ఇస్తుండటంతో రైతులు అటువైపే మొగ్గు చూపుతున్నారు. ప్రతి వారం ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటుండటం కూడా రైతులను ఇబ్బందులను గురిచేస్తోంది. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు పెడుతుండటంతో అక్కడికి వెళ్లేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. తేమ 8 శాతం కంటే ఎక్కువగా ఉంటే ధరలో కోత విధిస్తున్నారు. 12శాతం కంటే ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయడం లేదు. 8 శాతం కంటే తేమ ఎక్కువ ఉంటే ఒక్కో శాతానికి రూ. వంద చొప్పున తగ్గించి ఇస్తున్నారు. అంతేకాకుండా పొట్టి, పొడువు పింజ రకం అనే తేడాతో ధరలు తగ్గిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా కొద్దిగా రంగు మారిగా పత్తిని తీసుకోవడం లేదు. దీంతో రైతులు రవాణా ఖర్చులు నష్టపోతున్నారు.

తరచూ కేంద్రాల మూసివేత
పత్తి కొనుగోలు కేంద్రాలను పదే పదే మూసి వేస్తుండటంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. శుక్రవారం నుంచి మరో ఎనిమిది కొనుగోలు కేంద్రాలను మూసి వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. వికారాబాద్‌లోని ధరణి కాటన్ మిల్, శ్రీ సాయిబాబా ఆగ్రోటెక్ కాటన్ మిల్, అయ్యప్ప కాటన్ మిల్, పరిగి నియోజకవర్గంలోని రాకంచర్ల కాటన్ మిల్, శ్రీలక్ష్మి వేంకటేశ్వర ఇండస్ట్రీస్, మర్పల్లిలోని అయ్యప్ప కాటన్‌మిల్ ఇండస్ట్రీస్, ధారూరులోని శ్రీసాయి బాబా ఆగ్రో కాటన్ మిల్, కోట్‌పల్లిలోని మంగళం గిన్నేర్స్ మిల్లులను మూసి వేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి తెలిపారు.



ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

సర్వే పక్కాగా నిర్వహించాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో కొనసాగుతున్న ఈ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం ఉందా.. ప్రస్తుతం ఉంటున్న ఇల్లు ఎవరిది.. పెంకుటిల్లా.. పక్కా గృహమా.. ఖాళీ స్థలం ఉంటే అందుకు సంబంధించిన పత్రాలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఆ వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయించారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలు నమోదుకు ఎంత సమయం పడుతోంది.. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు.. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను అడిగారు. అనంతరం సర్వేయర్లకు సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని.. తప్పిదాలకు తావులేకుండా వివరాలు సేకరించాలన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా ఉంటే వాటి స్థానంలో కొత్త ఇంటిని నిర్మించుకునేందుకు ముందుకు వస్తే వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయండి

అనంతగిరి: ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పంపిణీ చేస్తాం
చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్

బొంరాస్‌పేట: ప్రజలకు ఉపయోగపడే పండ్ల మొక్కలను పంపిణీ చేస్తామని చార్మినార్ సర్కిల్ చీఫ్ సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్ అన్నారు. గురువారం బొంరాస్‌పేట చెరువు వద్ద అర్బన్ పార్కు కోసం స్థల పరిశీలన, కొత్తూరు నర్సరీ ఏర్పాటుకు పరిశీలన, అటవీశాఖ నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. కొత్తూరు నర్సరీని మరింత అభివృద్ధి చేసి సెంట్రల్ నర్సరీగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



బొంరాస్‌పేట చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్

ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సవిత తదితరులు పాల్గొన్నారు.

నేనున్నా.. అధైర్యపడకండి
అస్వస్థతకు గురైన విద్యార్థినులకు ఎమ్మెల్యే బీఎంఆర్ భరోసా



అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: నేనున్నాను.. అధైర్యపడకండి.. మీరంతా కోలుకునే వరకు అధికారులంతా అండగా ఉంటారని ఫుడ్‌పాయిజన్‌కు గురైన తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, కౌన్సిలర్ రత్నమాలతో కలిసి వైద్యం పొందుతున్న బాలికలతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. భోజనం విషయంలో జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫుడ్‌పాయిజన్ ఘటన దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటనలను ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం సరికాదన్నారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు అస్వస్థతకు కారణమైన వార్డెన్, ముగ్గురు వంట సిబ్బందిని తొలగించడం జరిగిందన్నారు. విద్యార్థినులు కోలుకుంటున్నారని తెలిపారు. వీరి వెంట సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమాలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి
- హాస్టళ్లను నిర్లక్ష్యం చేస్తోంది
- విద్యార్థినులను పరామర్శించడానికి వెళ్తుంటే అడ్డుకుంటారా?
- మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్



వికారాబాద్‌లోని చెన్నారెడ్డి చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించిన మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్, బీఆర్‌ఎస్ నేతలు

అనంతగిరి: ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని.. ఇందుకు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్ విమర్శించారు. తాండూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌కు గురైన విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్తున్న వారిని గురువారం వికారాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి చౌరస్తా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి చేరుకొని బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అస్వస్థతకు గురైన విద్యార్థినులను చూడడానికి తల్లిదండ్రులను కూడా అనుమతించడం లేదన్నారు. తాము బాలికల్లో ధైర్యం నింపేందుకు వచ్చామని.. ఇలా అడ్డుకోవడం దారుణమన్నారు. హాస్టల్‌కు వెళ్తే ప్రభుత్వ బండారం బయటపడుతుందన్నారు. విద్యార్థినులకు ప్రభుత్వ ఆస్పత్రిలో కాకుండా హాస్టల్‌లో వైద్యం చేయడం ఏమిటని కలెక్టర్‌ను ప్రశ్నించారు. మమ్మల్ని కట్టడి చేయడం భావ్యం కాదన్నారు. మీరు వసతిగృహాలను గాలికొదిలేసి, వాళ్ల అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు చూస్తున్నారని ఆరోపించారు. మేము చిన్న పిల్లలతో రాజకీయాలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడి ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి అనే దానిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలీసులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్‌ని అదుపులోకి తీసుకొని చన్‌గోముల పీఎస్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పలువురు నాయకులను నవాబ్‌పేట పీఎస్‌కు తరలించారు. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌తోపాటు మరి కొందరిని పరిగి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీశైలం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్ తదితరులు ఉన్నారు.

పరామర్శించే హక్కు లేదా?

పూడూరు: ప్రజాస్వామ్యంలో బాధితులను పరామర్శించే హక్కులేదా అని మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్ ప్రశ్నించారు. గురువారం తాండూరు ప్రభుత్వ గిరిజన గురుకుల హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్ కారణంగా విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని తెలుసుకున్న వారు పరామర్శకు బయలుదేరారు. ఈ క్రమంలో వికారాబాద్ పోలీసులు సబితారెడ్డిని అడ్డుకోవడంతో ఆమె ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్‌ను అరెస్ట్ చేసి చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్రంలో తరచుగా ఫుడ్‌పాయిజన్ అవుతున్నా ప్రభుత్వం, అధికారులు నాసిరకం భోజనం పెడుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో నాయకులు ఆదిల్, జాహెద్, ఫాజిల్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ఆందోళన

తాండూరు: అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ మంత్రులను పోలీసులు అడ్డుకోవడంతో తాండూరులోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. కలెక్టర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. విద్యార్థి లీలావతి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించాలని కలెక్టర్‌ను కోరారు. బాలిక పరిస్థితి బాగుందని ఆందోళన చెందాల్సిన పని లేదని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాసాచారి, నర్కుల నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

హైడ్రా దృష్టి సారించేనా!
- తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలో అన్యాక్రాంతం అవుతున్న చెరువులు
- మాసబ్ చెరువు శిఖం భూమిలో బండరాళ్లు, మట్టి డంప్
- తూతూమంత్రంగా చర్యలు..

తుర్కయంజాల్: పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలోని కుంట్లూరు పెద్ద చెరువు, బడంగ్‌పేట కార్పొరేషన్, మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు చెరువులపై ఇప్పటికే దృష్టి సారించిన హైడ్రా తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలో అన్యాక్రాంతం అయిన చెరువులపైనా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పురపాలక సంఘం పరిధిలోని తుర్కయంజాల్, రాగన్నగూడ, మన్నెగూడ, ఇంజాపూర్, తొర్రూర్, కొహెడ, బ్రాహ్మణపల్లిలోని అనేక చెరువులు, కుంటలు రియల్ ఎస్టేట్ మాఫీయా కబంధ హస్తాల్లో చిక్కుకుని అన్యాక్రాంతం అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫిర్యాదులు వచ్చినప్పుడు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని ఆ తరువాత వదిలేయడం పరిపాటిగా మారింది.

మాసబ్ చెరువు శిఖం భూమిలో..

రైతుల ముసుగులో మాసబ్ చెరువు శిఖం భూమిలో నుంచి సుమారు 60 ఫీట్ల రోడ్డు వేసేందుకు ప్రయత్నించి 80శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. నేటికీ ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. 2023 మేలో గుర్రంగూడ వైపు నుంచి సాగర్ రహదారి వరకు 5 నుంచి 6 అడుగులకు పైగా నీరున్న చెరువులో పెద్ద పెద్ద బండరాళ్లు, వందలాది టిప్పర్ల మట్టిని డంప్ చేసినప్పటికీ నామమాత్రంగా చర్యలు తీసుకుని అక్రమార్కులను వదిలేశారు. పెద్ద ఎత్తున ముడుపులు ముట్టినందుకే అలా వదిలేశారనే ఆరోపణలు వచ్చాయి. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని సర్వే నంబర్ 205లో నిండు కుండలా నీరున్న చోట ఇదే విధంగా మట్టిని డంప్ చేసి పూడ్చిన విషయం తెలిసిందే. ఈ రెండు సంఘటనలు జరిగిన సమయంలో స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చినప్పటికీ అప్పటి ఇరిగేషన్ ఏఈఈ, డీఈఈ పట్టించుకోలేదు. హైడ్రా విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించడంతో పాటు అక్రమార్కులకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు కోరుతున్నారు.

వైకుంఠధామంపై వెనక్కి..

సాగర్ రహదారికి కూతవేటు దూరంలో మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 45లోని 2.25 ఎకరాల శిఖం భూమి, సర్వే నంబర్ 43, 45లోని భూమిలో విస్తరించి ఉన్న ఎర్రకుంట ఆనవాళ్లు కూడా లేకుండా చేయాలనే కుట్ర కొన్నేళ్లుగా జరుగుతూనే ఉంది. 2016లో సర్వే నంబర్ 43లోని భూమిలో మట్టితో నింపి పూడ్చివేయడానికి ప్రయత్నించగా 'ఎర్రకుంట అమ్మకానికి సిద్ధం' అంటూ సాక్షి కథనం ప్రచురించడంతో కాస్త వెనుకడుగు వేశారు. తాజాగా ఈ కుంట పరిధిలోని కొంత భూమిలో వైకుంఠ ధామం నిర్మించేందుకు అధికారులు టెండర్లు పిలవగా పనులు కూడా ప్రారంభమయ్యాయి. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో వెనుకడుగు వేసిన విషయం విదితమే. చుట్టుపక్కల ఉన్న ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులతో పాటు పలు రియల్ ఎస్టేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు కట్టను వెడల్పు చేసేందుకు కొందరు ప్రయత్నించి పెద్ద ఎత్తున మట్టిని డంప్ చేసినా ఇరిగేషన్ అధికారులు కనీసం ఫిర్యాదు కూడా చేయలేదు. ఈ రెండు చెరువులే కాదు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల పరిధిలోని పలు చెరువులు అన్యాక్రాంతం అవుతున్నా చర్యలు మాత్రం లేవు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు అక్రమాలను వెలికి తీసి చెరువులు, కుంటలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



మాసబ్ చెరువు శిఖం భూమిలో రోడ్డు వేసేందుకు డంప్ చేసిన మట్టి, బండరాళ్లు

ప్రభుత్వ కేంద్రాలను వినియోగించుకోండి
- జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

శంకర్‌పల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. గురువారం ఆయన శంకర్‌పల్లి పట్టణం, మండలంలో పర్యటించారు. పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. నిల్వలు, అమ్మకాలు, రికార్డుల వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మిన విత్తనాలకు వెంటనే రసీదులు ఇవ్వాలన్నారు. అనంతరం మండలంలోని మోకిలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. గోపులారంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న మల్లారెడ్డి అనే రైతు పొలాన్ని పరిశీలించారు. పంట దిగుబడి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అనేక సబ్సిడీలు ఇస్తోందని, మండల వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లి తెలుసుకోవాలని సూచించారు. అవకాశం ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలన్నారు. ప్రభుత్వం మొక్కలకు 90 శాతం, డ్రిప్‌నకు ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 80శాతం సబ్సిడీ ఇస్తుందని వివరించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే పంట వేసిన నాలుగో ఏదాది నుంచి దిగుబడి వస్తుందని, ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయాధికారి వెంట చేవెళ్ల ఏడీఏ సురేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి ఇన్‌చార్జి సురేష్‌బాబు, వ్యవసాయ విస్తరణాధికారి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోకిలలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

క్లుప్తంగా

నేడు రూ.10 కోట్ల పనులకు శంకుస్థాపన

కొడంగల్‌: మున్సిపల్‌ పరిధిలో రూ.10 కోట్లతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు మున్సిపల్‌ చైర్మన్‌ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11 గంటలకు వడ్డర్‌గల్లి హనుమాన్‌ దేవాలయం దగ్గర కార్యక్రమం ప్రారంభం అవుతుంది. టీయూఎఫ్‌ఐడీసీ నుంచి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఏడు వార్డుల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టనున్నారు.

వ్యక్తి బలవన్మరణం

పూడూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి బలవన్మరనానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సోమన్‌గుర్తికి చెందిన శ్రీను(40) ఇంట్లో తరచూ గొడవ పడేవాడు. కుటుంబ కలహలతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు సంతానం. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాకింగ్‌కు వెళ్తుండగా..

- గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి
- చిలుకూరు సమీపంలో ఘటన


శ్రీను మృతదేహం

మొయినాబాద్‌: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్‌ మండల పరిధిలోని చిలుకూరు సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన చదువు శివకుమార్‌(23) భాస్కర కళాశాలలో బీఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం 5.30 గంటలకు మార్నింగ్‌ వాకింగ్‌ చేయడానికి ఇంటి నుంచి బయలుదేరాడు. చిలుకూరు సమీపంలోని మహిళా ప్రాంగణం వైపు వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన శివకుమార్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

శంషాబాద్‌ రూరల్‌: వేరే గ్రామంలో ఉన్న తన కొడుకు వద్దకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కవ్వగూడకు చెందిన వనరాసి వెంకటయ్య(75) చిన్న గోల్కొండలో ఉన్న తన పెద్ద కొడుకు అంజయ్య ఇంటికి వెళ్లడానికి గత నెల 22న బయలుదేరాడు. అంజయ్య ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. గతంలో ఇలాగే వెళ్లి కొన్ని రోజులకు ఇంటికి వచ్చాడు. ఈసారి కూడా వస్తాడని ఎదురు చూసిన కుటుంబ సభ్యులు ఎంతకీ రాకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టి..

యువకుడికి గాయాలు

శంషాబాద్‌: రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని సాతంరాయి రామాలయం వద్ద నివాసముండే అజయ్‌దాస్‌ (30) గురువారం ఉదయం టిఫిన్‌ తీసుకొచ్చేందుకు శంషాబాద్‌కు వెళ్లి వచ్చే సమయంలో కేఎల్‌సీసీ ఫంక్షన్‌ హాల్‌ సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో అజయ్‌దాస్‌ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

- నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- మెలకువలతో అధిక దిగుబడి
- షాబాద్‌ మండల వ్యవసాయాధికారి వెంకటేశం


నాగర్‌గూడలో యాసంగి సాగుకు పోసిన నారు


వ్యవసాయాధికారి వెంకటేశం

షాబాద్‌: ప్రస్తుతం యాసంగి సీజన్‌ ప్రారంభమైంది. అన్నదాతలు దుక్కులు దున్నతూ వరి నారు పోసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడిలో యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధితో కలిగే ప్రయాజనాలను షాబాద్‌ మండల వ్యవసాయాధికారి వెంకటేశం వివరించారు.

విత్తన శుద్ధి

నారు పోసే ముందు విత్తన శుద్ధి చేయాలి. తద్వారా పంటకు కీటకాలు, తెగుళ్లు ఆశించవు. కిలో విత్తనాలకు 2.5 గ్రాముల కార్బండెజిమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. లేదా కిలో విత్తనాలకు మూడు గ్రాముల కాప్టన్‌ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకుతినే పురుగు, ఉలికోడు, ముప్ప పురుగు ఆశించకుండా ఉంటుంది.

నారుమడి తయారీ విధానం

నారు పోయాల్సిన మడిని దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పారించడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి. ఎకర పొలం నాటడానికి అరగుంట భూమికి ఐదు కిలోల విత్తనాలు వాడాలి. అరగుంట నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్‌ ఉండే ఎరువులు వాడాలి.

నారులో కలుపు నివారణ

నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్‌ 1.5 మిలీ, ఒక లీటర్‌ నీటిలో కలిపి విత్తిన 7 లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు సైహాలో పాస్‌ బ్యూటైల్‌ 10 శాతం మందును 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్‌ 3జీ గుళికలు అరగుంట నారుమడికి 150 గ్రాముల చొప్పున చల్లాలి. లేదా మోనోక్రోటోఫాస్‌ 1.6 మి.లీ మందును లీటర్‌ నీటికి కలిపి పిచికారీ చేయాలి. జింక్‌ లోపాన్ని గమనిస్తే లీటర్‌ నీటిలో 2 గ్రాముల జింక్‌ ఫాస్పేట్‌ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారు 20.25 రోజుల వయసు ఉన్నపుడు 4 నుంచి 6 ఆకుల దశలో నాటుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుంది.

నాటు వేసే విధానం

నారు ఆకు లేతగా ఉంటేనే చేను తొందరగా తిరుగబెడుతుంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు వాడితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటరుకు 44 నారు మొలకలు ఉండేలా నాటుకోవాలి.

చలి నుంచి రక్షణ చర్యలు

- చలి ప్రభావం నుంచి నారు మడుల్లో ఎదగకపోవడం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారడంతో పాటు అందుకు రైతులు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.
- సాయంత్రం వేళలో నీరు తీసి పగటిపూట వెచ్చటి నీరు పారించాలి.
- రోజు సాయంత్రం అడుగు ఎత్తులో వెదురు చెక్కలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్‌ షీట్‌ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.
- జింక్‌ లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్‌ సల్ఫేట్‌ను లీటర్‌ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

విద్యార్థులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- మండల విద్యాధికారికి తల్లిదండ్రుల ఫిర్యాదు
- డీఈఓ కార్యాలయానికి అటాచ్‌ చేస్తున్నాం: ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి


స్టేషన్‌ధారూరు పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ధారూరు: విద్యార్థినులను వేధిస్తున్న కీచక ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన గురువారం మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు ప్రాథమికోన్నత పాఠశాలలో వెలుగుచూసింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపిన ప్రకారం.. ఉపాధ్యాయుడు కిష్టయ్య కొన్నిరోజులుగా 6,7వ తరగతి విద్యార్థినులను మానసికంగా, శారీకరంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. బాలురను తరగతిగది నుంచి బయటకు పంపించి తలుపులు వేసి బాలికలతో నృత్యాలు చేయించడం, అభ్యంతరకరంగా వ్యవహరించడం, భయపెట్టడం లాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నాడని వాపోయారు. బాలికల వాష్‌రూం వద్ద మద్యం సేవిస్తున్నాడని వెల్లడించారు. ఇదే విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాలకు వచ్చే విషయం తెలుసుకున్న సదరు ఉపాధ్యాయుడు అక్కడ నుంచి పారిపోయాడు. ఫోన్‌లో సంప్రదించగా కడుపునొప్పి బాధతో వెళ్లిపోతున్నాని చెప్పాడు. సహోపాధ్యాయులకు ఫంక్షన్‌కు వెళ్తున్నాని చెప్పడం గమనర్హం.

డీఈఓ కార్యాలయానికి అటాచ్‌ చేస్తాం

ఉపాధ్యాయుడు కిష్టయ్యపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, యువజన సంఘం సభ్యులు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సదరు ఉపాధ్యాయుడి దుశ్చర్యలను మండల విద్యాధికారి మీడియాకు వెల్లడించారు. కిష్టయ్యను డీఈఓ కార్యాలయానికి అటాచ్‌ చేయిస్తామన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని.. తాము పూర్తి నివేదికను డీఈఓకు అందజేస్తామన్నారు.

వ్యక్తికి రిమాండ్‌

కద్తాల్‌: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ శివప్రసాద్‌ తెలిపిన ప్రకారం.. ఈ నెల 5న రాత్రి మండల పరిధిలోని పల్లె చెలకతండాకు చెందిన మహిళ ఇంట్లోకి ఎవరూ లేని సమయంలో తండాకు చెదిన ఇస్లావత్‌ మత్రు అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం ఇస్లావత్‌ మత్రును అరెస్ట్‌ చేసి రిమాండ్‌ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

యువకుడి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్‌: మత్తుకు బానిసైన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఎంపీ పటేల్‌గూడకు చెందిన గజ్జెల తేజేశ్వర్‌రెడ్డి(25) డిగ్రీ ఫెయిల్‌ అవ్వడంతో తనకున్న వ్యవసాయ పొలాన్ని చూసుకుంటున్నాడు. మద్యం, గంజాయికి అలవాటు పడిన తేజేశ్వర్‌రెడ్డి బుధవారం రాత్రి స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్తున్నాని చెప్పి తిరిగి రాలేదు. గ్రామంలోని తన వ్యవసాయ పొలంలో పశువులపాకలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం తల్లి పొలానికి వెళ్లేవరకు కొడుకు మృతదేహం వేలాడుతుండడం చూసి ఆమె గుండెలు బాదుకుంటుఊ పోలీసులకు సమాచారం ఇచ్చింది. మృతుడి తండ్రి కొన్నేళ్ల క్రితమే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

- తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి
- కరన్‌కోట్‌ ఠాణాలో 40 కెమెరాలు ప్రారంభం



కరన్‌కోట్‌ పీఎస్‌లో ప్రారంభించిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్‌: గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గౌతపూర్‌ శివారులోని కరన్‌కోట్‌ ఠాణాలో 40 సీసీ కెమెరాలు ఐసీఎల్‌ ఫ్యాక్టరీ యాజమాన్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఐసీఎల్‌ సిమెంట్‌ ఫ్యాక్టరీ యాజమాన్యం సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.9లక్షల విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం ఫ్యాక్టరీ ప్లాంట్‌ హెడ్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ తరుపున ప్రజా సేవకు ముందుటామన్నారు. ఎస్‌ఐ విఠల్‌ రెడ్డి చొరవతోనే ఇది సాధ్యపడిందన్నారు. గౌపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు మాజీ సర్పంచ్‌ నరేందర్‌రెడ్డి రూ.50 వేలు, మల్కాపూర్‌లో ఏర్పాటుకు ఆర్‌సీ గౌడ్‌ రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్‌ డీఎస్పీ సదా నిరంజన్‌, స్థలదాత పటేల్‌ రాంరెడ్డి, ఎస్‌ఐ విఠల్‌ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

డిప్యూటీ తహసీల్దార్‌ బాలకృష్ణారెడ్డి

శంకర్‌పల్లి: విద్యార్థులకు ఇచ్చే భోజనంలో నాణ్యత ఖచ్చితంగా పాటించాలని శంకర్‌పల్లి డిప్యూటీ తహసీల్దార్‌, ఎస్సీ హాస్టల్‌ స్పెషల్‌ ఆఫీసర్‌ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక ఎస్సీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ తప్పక పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త వాటర్‌ ఫిల్టర్‌, విద్యుత్‌ లైట్లను అమర్చాలని సూచించారు. హాస్టల్‌ ప్రాంగణంలో ఉన్న మున్సిపల్‌ వాహనాలను తొలగించాలన్నారు. ప్రతీ వారం ఫాగింగ్‌ చేయించాలని మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌ను ఫోన్‌లో కోరారు. ప్రతీ రెండు రోజులకు ఒకసారి హాస్టల్‌ను పరిశీలిస్తానన్నారు.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్‌

- 9 కేసుల్లో హాజరు
- 12 మంది సాక్షులను క్రాస్‌ చేసిన న్యాయవాది కరుణసాగర్‌
- 19కి తదుపరి విచారణ వాయిదా

సిటీ కోర్టు : గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన పలు కేసుల్లో గురువారం ఆయన నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని సిటీలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మహమ్మద్‌ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బహదూర్‌పూర, మంగళ్‌హాట్‌ తదితర పోలీస్‌ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మొత్తం 9 కేసులపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి రాత్రి 7 గంటల వరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 12 మంది సాక్షులను అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ పి.శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో రాజాసింగ్‌ తరుపు న్యాయవాది కరుణసాగర్‌ క్రాస్‌ ఎగ్జామినేషన్‌ చేయగా కోర్టు రికార్డు చేసింది. తదుపరి విచారణను ఈనెల 19 కి వాయిదా వేసింది.

బీజేపీ ఎంపీ బండి సంజయ్‌ గైర్హాజరు..

హుజురాబాద్‌ ఉప ఎన్నికలో భాగంగా అప్పటి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రస్తుత బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ హుజురాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ను ఉల్లంఘిస్తూ రోడ్‌షో నిర్వహించి ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ కేసులపై గురువారం ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగిన విచారణకు బండి సంజయ్‌ గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది కరుణసాగర్‌ పిటిషన్‌ దాఖలు చేశారు. పార్లమెంట్‌ శీతాకాల సమావేశాల నేపథ్యంలో ఆయన కోర్టుకు హాజరు కాలేకపోయారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం ఈ కేసుల్లో ఇద్దరు సాక్షులు హాజరు కాగా అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ పి.శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో న్యాయవాది కరుణసాగర్‌ క్రాస్‌ ఎగ్జామినేషన్‌ చేశారు. తదుపరి విచారణ ఈనెల 19కి వాయిదా వేసింది.

ఉపాధ్యాయులదే బాధ్యత

ట్రెయినీ కలెక్టర్‌ ఉమాహారతి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ట్రెయినీ కలెక్టర్‌ ఉమాహారతి

అనంతగిరి: విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ట్రెయినీ కలెక్టర్‌ ఉమాహారతి అన్నారు. గురువారం వికారాబాద్‌లోని కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో జిల్లా స్థాయి సైన్స్‌ ఎగ్జిబిషన్‌, ఇన్‌స్పైర్‌ ప్రదర్శన(2023–24)ను ట్రెయినీ కలెక్టర్‌ ఉమాహారతి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తూ విద్యార్థులను ఎగ్జిబిట్స్‌కు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్‌ ఉమాహారతి మాట్లాడుతూ.. జీవితంలో ప్రతీ సన్నివేశం పరిశీలిస్తూ ఎందుకు..? ఎలా..? అంటూ ప్రశ్న వేసుకుంటూ వాటికి సమాధానాలు కనుక్కోవడమే సైన్స్‌ అన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథం, పరిశీలన, వైఖరిని అలవర్చుకోవాలన్నారు. మనిషి జీవితం సైన్స్‌తో ముడిపడి ఉందన్నారు. విద్యార్థులు ఇప్పటినుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించేవరకు విశ్రమించవద్దన్నారు. ఇన్‌స్పైర్‌ నుంచి 55 ప్రదర్శనలు, జిల్లా సైన్స్‌ ప్రదర్శనలో 398 ప్రదర్శనలు నమోదు అయ్యాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, కళాశాల ప్రిన్సిపాల్‌ సాయిలత, జిల్లా సైన్స్‌ అధికారి విశ్వేశ్వర్‌, ఆయా మండలాల విద్యాధికారులు, గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయులు, సైన్స్‌ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి


పూడూరు: ఎన్కేపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న డీపీఓ జయసుధ


బొంరాస్‌పేట: ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుడి వద్ద పరిశీలన

జిల్లా పంచాయతీ అధికారి జయసుధ

పూడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలనలో దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆమె వెంట ఎంపీడీఓ పాండు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

రేగడిమైలారంలో ఇంటింటి సర్వే

బొంరాస్‌పేట: ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరు చేయనున్న ఇళ్ల కోసం ఇంటింటి సర్వే ప్రారంభమైంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి నివాసాలను గురువారం రేగడిమైలారంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పరిశీలించారు. గ్రామంలో 600లకు పైగా ప్రజాపాలనలో దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుదారుల ఇళ్లు, ఖాళీస్థలాలు, ఇంటి పన్ను చెల్లింపులు వంటి వివరాలు నమోదు చేసుకుంటున్నారని కాంగ్రెస్‌ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా మండలాలు, గ్రామాల వారీగా ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుండప్ప, అమృతమ్మ, శేఖర్‌ తదితరులు ఉన్నారు.

క్లోరో హైడ్రైడ్‌ రసాయనం పట్టివేత

నిందితుడికి రిమాండ్‌


పోలీసుల అదుపులో నిందితుడు వరప్రసాద్‌గౌడ్‌

తాండూరు: కల్తీ కల్లు తయారికి ఉపయోగించే నిషేధిత రసాయనాన్ని(సీహెచ్‌) తాండూరు ఎక్సైజ్‌ శాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఎక్సైజ్‌ పోలీసులు తెలిపిన ప్రకారం.. బషీరాబాద్‌ మండల కేంద్రానికి చెందిన కొడంగల్‌ వరప్రతాప్‌గౌడ్‌ నిషేధిత క్లోరోహైడ్రైడ్‌(సీహెచ్‌) విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఎక్సైజ్‌ ఎస్‌ఐలు రవికుమార్‌, నిజాముద్దీన్‌ తమ సిబ్బందితో కలిసి వరప్రసాద్‌గౌడ్‌ ఇంట్లో సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో నిషేధిత రసాయనం ఐదు కిలోలు లభ్యమైంది. రసయనాన్ని సీజ్‌ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన నాగరాజుగౌడ్‌ నుంచి ఈ సీహెచ్‌ను కొనుగోలు చేసినట్లు నిందితుడు విచారణలో తెలిపారు. ఈ మేరకు వరప్రసాద్‌గౌడ్‌ను పోలీసులుగు రిమాండ్‌కు తరలించారు.

ఆలయాలను పరిరక్షించుకుందాం

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు స్వామి

కుల్కచర్ల: ఆలయాల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు స్వా మి అన్నారు. మండల పరిధిలోని ఘణపూర్‌ గ్రామంలో నిర్మితమవుతున్న శివాలయ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సనాతన ధర్మాన్ని మనమే పరిరక్షించుకోవాల్సి న అవసరం ఉందని.. ఆలయాల సంరక్షణ వంటి చర్యలకు మనవంతు సహకారాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌పీఎ స్‌ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌ గౌడ్‌, స్థానిక నాయకులు ఆంజనేయులు, హరికృష్ణ, మహేందర్‌, నర్సింలు, మహేశ్‌, శ్రీశైలం, శివరాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే క్రీడాపోటీలు

- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- ముగిసిన సీఎం కప్‌ మండలస్థాయి పోటీలు


మర్పల్లి: బహుమతులు అందుకుంటున్న విజేత జట్టు


బంట్వారం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్‌ మహేందర్‌రెడ్డి


తాండూరు రూరల్‌: కబడ్డీ విజేత మోడల్‌ స్కూల్‌ జట్టుకు బహుమతి అంజేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు రూరల్‌: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం సెయింట్‌ మార్క్స్‌ పాఠశాలలో సీఎం–కప్‌ క్రీడాపోటీల ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల అభ్యున్నతి కృషి చేస్తానన్నారు. ప్రతిభను వెలికితీసేందుకే క్రీడాపోటీలు ఉపయోగపడుతాయన్నారు. బాలుర వాలీబాల్‌ పోటీల్లో ప్రథమ స్థానంలో రాంపూర్‌, ద్వితీయ స్థానంలో కరన్‌కోట్‌, బాలుర కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి అంతారం, ద్వితీయ స్థానంలో కరన్‌కోట్‌, బాలికల కబడ్డీ పోటీల్లో తెలంగాణ మోడల్‌ స్కూల్‌(ఐనెల్లి), ద్వితీయ బహుమతి మల్కాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌, బాలుర ఖోఖో పోటీలో మొదటి బహుమతి జినుగుర్తి, ద్వితీయ బహుమతి బెల్కటూర్‌ పాఠశాల, బాలికల విభాగంలో మొదటి స్థానంలో కేజీబీవీ ఐనెల్లి, రెండో బహుమతి జెడ్పీహెచ్‌ఎస్‌ జినుగుర్తి పాఠశాలాలు నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్న పరిమళ్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ రవిగౌడ్‌, మండల ప్రత్యేకాధికారి సత్తార్‌, ఎంపీడీఓ విశ్వప్రసాద్‌, పీడీలు యాదగిరి, రవికుమార్‌, బుగ్గప్ప, బాలమణి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బంట్వారం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మర్పల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బంట్వారం, జెడ్పీహెచ్‌ఎస్‌ ఆవరణలో మండల స్థాయి సీఎం కప్‌ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఉద్యోగ నియామకాల్లోనూ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇలాంటి పోటీలతోనే క్రీడాకారుల నైపుణ్యం బయటికి వస్తుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఎంపీడీఓ రాములు, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ నాగరాజు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నతంగా రాణించాలి

మర్పల్లి: క్రీడాపోటీల్లో ప్రతిభ చూపి ఉన్నతంగా రాణించాలని మర్పల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మహేందర్‌రెడ్డి అన్నారు. సీఎంకప్‌ మండల స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహేందర్‌రెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్‌ అండర్‌–14 విభాగం, ఖోఖో విజేత జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజమల్లయ్య, సూపరింటెండెంట్‌ కృష్ణారావు, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు సురేష్‌, మార్కెట్‌ కమిటీ ఉపాధ్యక్షుడు మల్లేశ్‌ యాదవ్‌, సహకార సంఘం ఉపాధ్యక్షుడు షఫీ, సీనియర్‌ నాయకులు నగేష్‌, పట్లూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహేశ్‌, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.